తగ్గని చలి తీవ్రత

» షాబాద్‌లో 15.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

రంగారెడ్డి అర్బన్, జనవరి 7: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినా చలిప్రభావం మాత్రం తగ్గలేదు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆదివారం 15.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పెద్దఉమ్మెంతాల్‌లో 15 డిగ్రీలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేసవరంలో 16.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

షాద్‌నగర్‌లోని కేఎన్(కట్టా నర్సింహులు గార్డెన్)లో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలో మహిళలు పోటాపోటీగా రంగవల్లులు తీర్చిదిద్ది కనువిందు చేశారు. పదుల సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు పాల్గొన్న ఈ పోటీలో వేసిన ముగ్గులతో నేలపై హరివిల్లు విరిసింది. మహిళలు వేసిన ముగ్గులు ముఖ్య అతిథులను, ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అతిథులు కొనియాడారు.

బహుమతి రావడం ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీలో పాల్గొనడం, తనకు ఫస్ట్ ప్రైజ్ రావడం ఆనందగా ఉందని ప్రథమ బహుమతి విజేత పి.ధనలక్ష్మి అన్నారు. తాను 20సంవత్సరాల నుంచి ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో పాల్గొంటున్నానన్నారు. ఈ సారి ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉందని, రాష్ట్రస్థాయి పోటీలోనూ బహుమతి సాధించేలా కృషి చేస్తానన్నారు. ద్వితీయ బహుమతి విజేత సుమలత మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో ప్రతీ సంవత్సరం పాల్గొంటున్నానన్నారు. సెకండ్ ప్రైజ్ రావడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే సంవత్సరం ప్రథమ బహుమతి సాధించేందుకు కృషిచేస్తానన్నారు. మూడో స్థానంలో నిలిచిన సంజన మాట్లాడుతూ.. పదేళ్లుగా యేటా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో పాల్గొంటున్నానన్నారు. గతేడాది కన్సోలేషన్ బహుమతి వచ్చిందని, ఈ సారి తృతీయ బహుమతి సాధించానన్నారు. మరింత మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని ఆమె కోరారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

చుక్కల తోటలా.. చక్కని ముగ్గులు

అవనిపై పరచిన మగువలు

సంక్రాంతి సందడి తెచ్చిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీ



షాద్‌నగర్, జనవరి 7: అరచేతి వేళ్లను కుంచెలుగా.. ఆకాశంలోని చుక్కలను అవనిపై చేర్చినట్టు అత్యున్నత, అందమైన భావాలు కలిగిన అతివలు ముగ్గులు వేసి కనువిందు చేశారు. సక్రాంతి ముగ్గులకు సరికొత్త వైభవం తెప్పించి మెప్పించారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్, ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్ణసీమ సుకేతన.. షాద్‌నగర్ నుంచి శతాబ్ది టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో కనిపించిన దృశ్యం ఇది. అతివలు తమ ప్రతిభను అరచేతితో అందంగా ఆవిష్కరించిన తరుణమిది. ఒక్కసారి ఈ ముచ్చటైన ముగ్గుల ముంగిటకు వెళితే...

విజయవంతంగా ముగ్గుల పోటీ

షాద్‌నగర్‌లోని కేఎన్(కట్టా నర్సింహులు గార్డెన్)లో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమం విజయవంతమైంది. ఈ పోటీలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని మహిళలు, బాలికలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన పోటీ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. పట్టణంలోని ఎస్‌వీపీ కళాశాల మహిళా అధ్యాపకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ ముగ్గులను ఎంపిక చేశారు. మహిళలు వేసిన ముగ్గులను గంట పాటు నిశితంగా పరిశీలించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గులను ఎంపిక చేశారు. కాగా ప్రథమ బహుమతి పొందిన పి.ధనలక్ష్మికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ద్వితీయ బహుమతి పొందిన సుమలతకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, తృతీయ బహుమతి పొందిన సంజనకు రంగారెడ్డి జిల్లా అర్బన్ రిపోర్టర్ శ్రీనివాసచారి బహుమతులు అందజేశారు. మిగతా వారికి ప్రోత్సాహక, కన్సోలేషన్ ప్రైజ్‌లను ఇతర అతిథులు అందజేశారు.

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

సంస్కృతి సంప్రదాయాలను ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ దినపత్రిక, టీవీ చానెల్ పరి రక్షిస్తున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ముగ్గుల పోటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంతరించిపోతున్న ముగ్గులను తిరిగి బాహ్య ప్రపంచంలోకి తేవడంతో పాటు మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తెస్తున్న ఘనత ఒక్క ఆంధ్రజ్యోతి దినపత్రికకు మాత్రమే దక్కిందన్నారు. గత 20 ఏండ్లుగా షాద్‌నగర్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. గతంలో సంక్రాంతి పండుగ అంటే ఇంటి ముందు కల్లాపి చల్లి చక్కగా ముగ్గులు వేసి వాటిపై గొబ్బెమ్మలను అమర్చి అలంకరించేవారన్నారు. కానీ అపార్ట్‌మెంట్, కంప్యూటర్ కల్చర్ వచ్చిన తర్వాత పండుగల శోభ తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ తిరిగి పండుగల కళలకు పునరుజ్జీవం పోస్తున్నదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కొనియాడారు.

నిక్కచ్చిగా వ్యవహరించేది ఆంధ్రజ్యోతి మాత్రమే

నిజాలను నిర్భయంగా రాసేది ఒక్క ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ మాత్రమే అని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదురయినా వాటిని అధిగమిస్తూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, అక్రమాలను వెలుగులోకి తెస్తోందన్నారు. సమాజానికి ఉపయోగపడే పనులతో పాటు, సమాజ హితానికి కూడా పాటుపడుతోందని చెప్పారు. వార్తల విషయంలో ఆంధ్రజ్యోతి పత్రిక నిక్కచ్చిగా వ్యవహరిస్తుండటంతో అన్యాయాలు, అక్రమాలకు అడ్డుకట్ట పడుతోందన్నారు. ముగ్గుల పోటీకి తమవంతు సహకారాన్ని కూడా అందిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా ఆంధ్రజ్యోతి దిన పత్రిక ముగ్గుల పోటీలను నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ముగ్గులతో దేశ సంస్కృతి ముడిపడి ఉందన్నారు. ఆంధ్రా తరహాలో తెలంగాణలోనూ సంకాంత్రి పండుగను జరుపుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అన్ని పండుగల విశిష్టతల గురించి తల్లితండ్రులు కూడా వారి పిల్లలకు తెలియజేయాలని ఆయన సూచించారు. జెడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు పాల్గొనడం తనకు సంతోషకరంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో గెలుపు, ఓటములు అని ఆలోచించకుండా ఆడవారు ప్రతిఒక్కరూ పాల్గొనాలని సూచించారు. షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రతీ సంవత్సరం ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ ఆచారాలు, సంస్కృతి పరిరక్షణలో మహిళలను ప్రోత్సహిస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

బహుమతులు అందజేసిన ముఖ్య అతిథులు

ముగ్గుల పోటీకి ఎల్లవేళలా నేను సహకరిస్తా - శతాబ్ది టౌన్‌షిప్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి

సంకాంత్రి పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీకి ఎల్లప్పుడూ తాను సహకరిస్తూ స్పాన్సరర్‌గా వ్యవహరిస్తానని శతాబ్ది టౌన్‌షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ముగ్గులను పోటీలను ఏటా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. తెలంగాణ సంప్రదాయాలు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పోటీలో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు వేసిన ముగ్గులు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని, అందుకు గాను పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి రూ.500, ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ రిపోర్టర్ శ్రీనివాసచారి, షాద్‌నగర్ రిపోర్టర్ టి.సంజయ్‌కుమార్, షాద్‌నగర్ అర్బన్ రిపోర్టర్ ఎల్.మోహన్‌రెడ్డి, రూరల్ రిపోర్టర్ రామచంద్రయ్య, కొత్తూరు, కేశంపేట, కొందుర్గు, నందిగామ, చౌదరిగూడ, ఏబీఎన్ రిపోర్టర్లు భవాని వేణుగోపాల్, శేఖర్‌యాదవ్, సత్యనారాయణ, రవికుమార్‌గౌడ్, బంగారు మల్లేష్, మారం చందు పాల్గొన్నారు.



మొదటి బహుమతి పొందిన ధనలక్ష్మి ముగ్గు



ద్వితీయ బహుమతి పొందిన సుమలత ముగ్గు



తృతీయ బహుమతి పొందిన సంజన ముగ్గు

'ఇందిరమ్మ'పైనే ఆశలు

» ఈ పథకానికి జిల్లాలో అర్హులు 31,169 మంది
» నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ
» ప్రజాపాలనలో వెల్లువెత్తిన దరఖాస్తులు
» నిరుపేదల సొంతింటి కల నెరవేరేనా?

బీఆర్‌ఎస్ ప్రభుత్వ 'గృహలక్ష్మి' రద్దు

ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పితే గుడిసెలు, కిరాయి ఇళ్లలో ఏళ్లపాటు కాలం ఎల్లదీస్తున్న పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అని, ఎన్నికల సమయంలో గృహలక్ష్మి పథకం అంటూ తెచ్చి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తామని చెప్పింది తప్పితే అమలే కాలేదు. ఆలోపే ఎన్నికలొచ్చాయి. తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంతో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తామని ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించింది. ఈ నేపథ్యంలో పేదలు ఈ సర్కార్‌పై ఆశలు పెట్టుకున్నారు.

రంగారెడ్డి అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఇల్లు లేని పేదర సొంతింటి కల నెరవేరడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పితే నిరుపేదలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గతంలో వచ్చిన టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్) ప్రభుత్వాలు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని పదేళ్ల పాటు హామీలు ఇచ్చిందే తప్పితే అర్హుల్లో పది శాతం మందికైనా సొంతిళ్లు కట్టివ్వలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తగా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3వేల చొప్పున ఇళ్లను కేటాయించింది. ఎంపిక చేసిన వారికి 3లక్షల రూపాయల చొప్పున ఇంటి నిర్మాణంలో వివిధ దశల్లో సమయాల్లో మూడు విడతల్లో ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించింది. ఎంపిక బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. వచ్చిన దరఖాస్తుల్లో అర్హతను బట్టి ఎంపిక చేసి మొదటి విడతలో జిల్లాలో 22,150 మందికి మొదటి విడత సాయాన్ని అందించాలని దరఖాస్తులను స్వీకరించింది. గృహలక్ష్మి పథకానికి జిల్లాలో 44,985 దరఖాస్తులొచ్చాయి. వాటిలో 31,169 దరఖాస్తులను అర్హమైనవిగా అధికారులు గుర్తించారు. ఎన్నికల కోడ్ వచ్చే కొన్ని రోజుల ముందు 1,232 మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను(ప్రొసిడింగ్స్) మాత్రం అందించారు. అంతలోనే ఎన్నికలు.. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడం.. గృహలక్ష్మి స్కీమ్‌ను రద్దుచేయడంతో ఈ పథకం మూలనపడింది. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో అయోమయం మొదలైంది. కొత్త ప్రభుత్వంలో మరోసారి దరఖాస్తు చేయాలా? అన్న సంశయం మొదలైంది. ఈ లోగా ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వమే షామ్‌లు ఇచ్చి దరఖాస్తులను స్వీకరిస్తోంది. అలాగే గత ప్రభుత్వంలో పెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం ముందుకు సాగలేదు. ఇళ్ల కోసం జిల్లాలో 97,616 నిరుపేదలకు మీసేవల్లో దరఖాస్తు చేశారు. 2015-16-17లో గత సర్కార్ 6,777 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లక్ష్యంగా పెట్టుకోగా అందులో 6,637 ఇళ్లను నిర్మించేందుకు అనుమతి లభించింది. దీనికి 274.35 ఎకరాల భూమిని కేటాయించారు. 2,293 ఇళ్లకు మౌలిక సదుపాయలు కల్పిస్తున్నారు. పూర్తయిన 2,293 ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు 1,988 మందిని అర్హులుగా గుర్తించారు. కానీ ఇప్పటి వరకు గృహాలు కేటాయించలేదు. పేదలు ఇంకా అద్దె ఇంట్లోనే కాలం వెల్లదీస్తున్నారు.



గృహలక్ష్మి పథకం వివరాలు

జిల్లా లక్ష్యం	:22,150
వచ్చిన దరఖాస్తులు	:44,985
పరిశీలించినవి	:44,917
అర్హమైనవి	:31,169
అప్‌లోడ్ చేసినవి	:30,642
ప్రొసీడింగ్స్ పంపిణీ	:1,232

'గృహలక్ష్మి'కి రాంరాం.. 'ఇందిరమ్మ'కు జై

ఖాళీ స్థలం ఉండి సొంతిల్లు లేని నిరుపేదలు ఇల్లు కట్టుకునేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంగళపాడింది. ఈ స్కీమ్ స్థానంలో గతంలో ఉన్నట్టు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తెచ్చింది. ఇందిరమ్మ పథకం కింద పేదల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్.. ఆ మాట ప్రకారం ప్రజాపాలన కార్యక్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ప్రచారంలో పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5లక్షల నగదు, అలాగే స్థలం లేని వారికి స్థలంతో పాటు, ఇల్లు కట్టుకునేందుకు యూనిట్‌కు రూ.5లక్ష ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాని వాళ్లు, గృహలక్ష్మిలో అర్హత సాధించిన వారు, పూరింట్లో, అద్దె గదుల్లో ఉండే వారు ప్రజాపాలన సభల్లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైతే రూ.5లక్షలు వస్తాయని ఆశతో ఉన్నారు. ఈ కొత్త ప్రభుత్వం అయినా తమకు ఇల్లు కట్టిస్తుందనే ఆశతో పేదలున్నారు.



శిథిలావస్థకు చేరిన లక్ష్మమ్మ ఇల్లు



ఈ ఫొటోలోని వృద్ధురాలి పేరు అవుసుల లక్ష్మమ్మ. తుమ్మలపల్లి గ్రామం. చిల్లేడు చౌదరిగూడ మండలం. గతంలో ఆమె ఇల్లు లేకుండా గడిపింది. కొన్నేళ్ల క్రితం గ్రామానికి చెందిన షాన్‌పాషా సహకారంతో చిన్న ఇంటిని నిర్మించుకుంది. పైకప్పుగా షాబాద్ బండలు వేసింది. ఏళ్ల క్రితం నిర్మించిన ఇల్లు కావడంతో ఇప్పుడది శిథిలావస్థకు చేరింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆమెకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరైనా ఇవ్వలేదు. దీంతో చేసేది లేక లక్ష్మమ్మ ప్రస్తుతం కూలే స్థితికి చేరిన ఇంట్లోనే నివసిస్తోంది.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు

ఇళ్ల కోసం మీ సేవల్లో చేసుకున్న దరఖాస్తులు : 97,616
ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన భూమి : 274.35 ఎకరాలు
కేటాయించిన ఇళ్లు : 6,777
(గ్రామీణం: 3,977, మున్సిపాలిటీలు : 2,800)
మంజూరైన గృహాలు : 6,645
టెండర్ పిలిచినవి : 6,175
టెండర్ అగ్రిమెంట్ అయినవి : 2,836
పురోగతిలో ఉన్నవి : 2,637
నిర్మాణం పూర్తయినవి : 2,293
లబ్ధిదారులకు కేటాయించినవి : 1,988



కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కేఎల్లార్‌ను కలిసిన ఉపాధ్యాయులు

రంగారెడ్డి అర్బన్, జనవరి7: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను విభజించి మహబూబ్‌నగర్‌లోని పది మండలాలు కలపడం వల్ల రంగారెడ్డి ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రంగారెడ్డి ఉపాధ్యాయ, నిరుద్యోగ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు న్యాయం చేయాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని ఆదివారం తుక్కుగూడలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కేఎల్లార్‌ను కలిసిన వారిలో సేవ్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధులు మధుకర్‌రెడ్డి, శంకర్ నాయక్, శ్రవణ్‌కుమార్, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, జహంగిర్ పాషా, శరత్‌చంద్ర, జగదీశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ, ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎయిర్‌పోర్టు వద్ద మద్యం ప్రియుల వీరంగం

» ముగ్గురిపై ఆర్జీఐఏ పీఎస్‌లో కేసు నమోదు

శంషాబాద్ రూరల్, జనవరి 7: శంషాబాద్ విమానాశ్రయం వద్ద మందు బాబులు వీరంగం సృష్టించారు. శనివారం ఉదయం 6:20గంటలకు యూకే నుంచి వచ్చిన ఇద్దరు, వారిని రిసీవ్ చేసుకునేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చిన మరి కొందరు కలిసి ఎయిర్‌పోర్టులోని ఏరోప్లాజా వద్ద ఉన్న బారులో మద్యం తాగారు. అనంతరం వారు రెండు కార్ల(టీఎస్36 సి7866), (టీఎస్21 కె0555)లో ఇంటికి వెళ్తుండగా టోల్ వద్ద జీఎంఆర్ సిబ్బంది కార్ల పార్కింగ్ చార్జీ అడిగారు. ఎందుకివ్వాలంటూ మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు టోల్ సిబ్బందిపై దాడి చేశారు. సిబ్బందిలో ఒకరికి గదవకు గాయాలయ్యాయి. దీంతో మద్యం మత్తులో ఉన్న వారు రెండు కార్లతో రాంగ్ రూట్‌లో వెళ్లి బారికెడ్లను ధ్వంసం చేసుకుంటూ అక్కడి నుంచి పరారయ్యారు. కార్ల నంబర్ ప్లేట్ల ఆధారంగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. గొడవ పడ్డ వారు సిద్దిపేట జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వారిని త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రజాపాలనలో 1,07,539 దరఖాస్తులు


ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 7 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ డిసెంబర్ 28 నుంచి పదిరోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో మొత్తంగా 1,07,539 దరఖాస్తులు అందాయని చెప్పారు. మండలాలవారీగా.. మంచాల 18,694, యాచారం 16,970, ఇబ్రహీంపట్నం 10,371, అబ్దుల్లాపూర్ మెట్ 15,414, మున్సిపాలిటీల వారీగా ఆదిభట్ల 6,256, ఇబ్రహీంపట్నం 8,894, తుర్కయంజాల్ 22,834, పెద్దఅంబర్‌పేట్ 17,000 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి, పెన్షన్, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. దరఖాస్తుల డేటాఎంట్రీని జనవరి 17 వరకు పూర్తి చేస్తామని చెప్పారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు : సీఐ

మొయినాబాద్ రూరల్, జనవరి 7 : భూ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ సీఐ గుడి పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలోని సర్వేనంబర్ 145లోని 9 ఎకరాల భూమిలో 145 సీఆర్‌పీసీ సెక్షన్ అమలులో ఉందని.. ఆ స్థలంలోనికి ఎవరైనా వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ స్థలంలో సిబ్బందితో నోటీసుబోర్డు ఏర్పాటు చేయించారు. కాగా, గతంలో హిమాయత్ నగర్ చౌరస్తా సమీపంలోని స్థలానికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగింది. తరచూ గొడవలు కూడా జరిగేవి. ఈక్రమంలో ఇటీవల ఒక వర్గానికి అనుకూలంగా తీర్పు రాగా.. జీర్ణించుకోలేని మరో వర్గం అక్కడ అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారు. దాంతో రెవెన్యూ అధికారులు ఇటీవల వెంచర్‌ను తొలగించారు. కొన్నిరోజులుగా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుండడంతో మొయినాబాద్ పోలీసులు చేవెళ్ల ఆర్డీవోకు విషయం తెలిపారు. స్పందించిన ఆయన తాజాగా రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. 145సీఆర్‌పీసీ నోటీసుబోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలోకి ఎవరు ప్రవేశించినా చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సీఐ గుడిపవన్ కుమార్‌రెడ్డిలు హెచ్చరించారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఆమనగల్లు, జనవరి 7 : కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన అంతమై ప్రజా పాలన వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ విజయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి ఆరు గ్యారంటీ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరా సింగ్, నాయకులు తులసీరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

కడ్తాల్, జనవరి 7: కడ్తాల మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కడ్తాల మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన అన్నారు. కడ్తాలలో అధార్ కేంద్రం ఏర్పాటు గూర్చి ఆదివారం సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రికి వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాలె మల్లేశ్ గౌడ్‌తో కలిసి జహంగీర్‌బాబా మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే కడ్తాలతో పాటు ఇతర మండలాల ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.

చదువుతోనే సమాజంలో మార్పు

ఆమనగల్లు , జనవరి 7: ప్రతీ ఒక్కరు చదువుకున్నప్పుడే సమాజంలో మార్పు సాధ్యమని జ్ఞాన ప్రచార సభ నిర్వాహకులు, ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ డివిజన్ సభ్యుడు జంతుక శంకర్ అన్నారు. మహనీయుల ఆశయ సాధనకు అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత చరిత్రలను, వారి ఆశయాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో జ్ఞాన ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నాయకులతో కలిసి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ జ్ఞాన సమాజ నిర్మాణం ద్వారానే అభివృద్ధి, సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేయాలని అన్నారు. నాయకులు హఫీజ్, గన్నారం బాలు, దరువుల మహేశ్, జంతుక రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గట్టు మైసమ్మజాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

దౌల్తాబాద్, జనవరి 7: మండలంలోని అంతారంలో జరిగిన గట్టు మైసమ్మ జాతర ఉత్సవాల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నరేందర్‌రెడ్డి

కొడంగల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అండగా నిలిచారు. ఆటోలో ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొన్న ఆయన రావుల్‌పల్లి సమీపంలో బైక్‌పై వస్తున్న యువకుడు ప్రమాదానికి గురికావడాన్ని గమనించారు. వెంటనే బాధితున్ని ఆటోలో ఆసుపత్రికి తరలించారు.

స్పీకర్‌ను కలిసిన బషీరాబాద్ వైస్‌ఎంపీపీ


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో వైస్ ఎంపీపీ దంపతులు

బషీరాబాద్, జనవరి 7: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బషీరాబాద్ వైస్‌ఎంపీపీ దంపతులు జడల అన్నపూర్ణ అనంతయ్య దంపతులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాండూరు వాసి, స్నేహితుడు స్పీకర్ కావడంతో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆరుట్ల: జెడ్పీహైస్కూల్ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

మంచాల, జనవరి 7 : మండల పరిధిలోని ఆరుట్ల జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన 1994 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం జరుపుకున్నారు. నాటి అధ్యాపకులు శ్రీనివాస్‌గౌడ్, రంగారావు, యాదయ్య, రమణారెడ్డి, రవికుమార్, నర్సింగ్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను సత్కరించారు. పాండాల జంగయ్యగౌడ్, మేకలశ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, మోహన్‌రెడ్డి, మద్దెలరాజు, అనీస్, అరుణ, కృష్ణవేణి, సరితతో పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం

కందుకూరు, జనవరి 7 : పేదల కోసం లయన్స్‌క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ మంద జ్యోతి అన్నారు. బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ వారు మండల కేంద్రంలో అన్నదానం చేశారు. ఆదివారం వారాంతపు సంత ఉన్నందున అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు రాష్ట్రవ్యాప్తంగా మీల్స్‌ఆన్‌వీల్స్ అని ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు ఎంపీపీ చెప్పారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి, చార్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి. మహేంద్రకుమార్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, జనవరి 7: చిలుకూరులోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ లగ్గం, బోనాలు నిర్వహించారు. మధ్యాహ్నం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం మల్లన్న బోనాలు తీశారు. సాయంత్రం అగ్నిగుండాలు, ఒగ్గువారు ఉక్కు గొలుసులు తెంపారు. ఉత్సవాలకు స్థానికులతో పాటు హైదరాబాద్, ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. చేవెళ్ల మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీపీ నక్షత్రంజైవంత్, సర్పంచ్ స్వరూప, ఆలయ కమిటీ ఛైర్మన్ మల్లేష్, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, రమ్యరాజు, దర్గమహేందర్, నరేందర్, నర్సింహాగౌడ్, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం, మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు(ఇన్‌సెట్)

పేదలకు 'అభయహస్తం!'

- 8 రోజుల్లో 5,53,277 దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలనలో దరఖాస్తులకు విశేష స్పందన
- ఆరు గ్యారెండీలపై గంపెడాశలు
- సాఫీగా ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ



ఆమనగల్లు మండలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 7): పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర సర్కారు ముందుకు సాగుతోంది. అర్హులకు ఆరు గ్యారెంటీలను అందించేందుకు తెలంగాణ నూతన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' సభలు సాఫీగా ముగిశాయి. జిల్లాలో గత నెల 28న ప్రారంభమై ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన సభలు, అభయ హస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజాపాలన కార్యక్రమం ముగింపు సమయం నాటికి మొత్తం 5,53,277 దరఖాస్తులను స్వీకరించారు. వాటిల్లో గ్రామ పంచాయతీల నుంచి 2,91,470 దరఖాస్తులు, మున్సిపాలిటీల్లో 2,61,807 చొప్పున దరఖాస్తులు స్వీకరించారు. ఎనిమిది రోజుల పాటు కొనసాగిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలోని 21 మండలాల్లోని 558 గ్రామ పంచాయతీలు, 16 మున్సిపాలిటీల్లో అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల్లో గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం ఎక్కువగా దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను ఈ నెల 17 వరకు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ప్రతి రోజు డేటా ఎంట్రీ చేసే విధంగా కలెక్టర్ శశాంక చర్యలు తీసుకుంటున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది.

గ్రామాల్లో తేదీల వారీగా వచ్చిన దరఖాస్తులు

డిసెంబరు 28	29,874
డిసెంబరు 29	57,105
డిసెంబరు 30	57,567
జనవరి 2	47,732
జనవరి 3	32,342
జనవరి 4	25,141
జనవరి 5	19,114
జనవరి 6	22,595

గ్రామ పంచాయతీలు : 558
కుటుంబాల సంఖ్య : 2,46,626
చివరి రోజు వచ్చిన దరఖాస్తులు : 22,595
మొత్తం స్వీకరించిన దరఖాస్తులు : 2,91,470

మున్సిపాలిటీల్లో స్వీకరించిన దరఖాస్తులు
మున్సిపాలిటీలు : 16
వార్డులు : 363
కుటుంబాల సంఖ్య : 2,88,361
కౌంటర్ల సంఖ్య : 2,698
మొత్తం దరఖాస్తులు : 2,61,807

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- సీజీఆర్ ఆధ్వర్యంలో ఘనంగా సంకాంత్రి వేడుకలు
- అలరించిన మహిళల రంగవల్లులు
- సంస్కృతి, సంప్రదాయాన్ని చాటిన భోగిమంటలు



భోగి వేడుకల్లో సీజీఆర్ ప్రతినిధులు



సంస్కృతిని చాటిన చాటిన భోగిమంటలు

కడ్తాల్ , జనవరి 7: కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పర్యావరణ బాల చైతన్య కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు , సీజీఆర్ సభ్యులు, మహిళలు ,యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలు కొనసాగాయి. సీజీఆర్ సంస్థ ఛైర్మన్ లీలా లక్ష్మారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంక్రాంతి సంబురాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలకు అద్దం పట్టాయి. విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి లీలా లక్ష్మారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులకు గాలిపటాలు, తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ వ్యవస్థాపకులు కోర్పోలు లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, నర్సింహ్మారెడ్డి, ది హెల్త్ సెంటర్ డైరెక్టర్ సాయిబాస్కర్ రెడ్డి, బాలచైతన్యకేంద్రాల నిర్వాహకులు రజనికాంత్, కో-ఆర్డినేటర్ దీపిక, మౌసినాబేగం మౌనిక, శిరీష, మమత, వెంకటేశ్, కోటయ్య, వీరేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న కోదండరామ్

ఆమనగల్లు, జనవరి 7: చట్టాలు, న్యాయవ్యవస్థపై న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడు సత్వర న్యాయాన్ని పొందే వీలుంటుందన్నారు. కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో కోదండ రామ్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ప్రజాచైతన్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో న్యాయవాదులు పాల్గొనాలని సూచించారు. అనంతరం యాదిలాల్ కోదండరామ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోశాధికారి అర్థం నర్సింహ, నాయకులు రాజిరెడ్డి, రాంరెడ్డి, జానకి రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన
దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆమనగల్లు/మాడ్గుల, జనవరి 7: మాడ్గుల మండలం ఆవురుపల్లి గ్రామంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క అల్లాజీ గౌడ్, ఆమనగల్లు మండల గౌడ సంఘం అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ డిమాండ్ చేశారు. నింధితులను గుర్తించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలిపారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు సతీష్‌గౌడ్, నర్సింహగౌడ్, నారాయణ గౌడ్, లక్ష్మీపతి, నిరంజన్‌గౌడ్, బాలకృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. పాపన్న విగ్రహం ధ్వంసం పట్ల గౌడసంఘం కడ్తాల మండల అధ్యక్షుడు మాలె మల్లేశ్‌గౌడ్ విచారం వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆవురుపల్లిలో లాలయ్యగౌడ్, నారాయణగౌడ్, వెంకటయ్యగౌడ్, నర్సింహ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 25లక్షల సర్పంచ్ స్వంత నిధులతో సీసీ రోడ్డు
- సర్పంచ్‌ను అభినందించిన ఎమ్మెల్యే



భవనాన్ని ప్రారంభించిన అనంతరం నాయకులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, జనవరి 7: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో 'మన ఊరు- మనబడి' కార్యక్రమంలో భాగంగా 50లక్షల రుపాయలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎస్‌బీపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆద్వర్యంలో రూ. 25లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే రూ.40లక్షలతో నిర్మించబోయే హెచ్‌ఎండీఏ సీసీ రోడ్డు పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబటి ప్రభాకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలాభివృద్ధి కోసం సీఎం ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్‌ను సర్పంచ్ అంబటి ప్రభాకర్ సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, స్థానిక జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ అగీర్ రవికుమార్‌గుప్త, సర్పంచ్ బాల్‌రాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో
బీఆర్ఎస్ 'సంక్షోభ పాలన'



శివరామకృష్ణారెడ్డి

మహేశ్వరం, జనవరి 7 : ఎంతోమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లు సంక్షేమం పేరుతో సంక్షోభ పాలన సాగించిన బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వం నెలరోజుల పాలనను విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని యూత్ కాంగ్రెస్ మీడియా వి భాగం రాష్ట్ర సంయుక్త సమన్వయకర్త కప్పాటి శివరామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ దళితబంధు, దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల వ్యవసాయ భూమి, బీసీ బంధు, గృహలక్ష్మి, గిరిజన బంధు, రెండు పడకలగదుల ఇళ్లు వంటి హామీలు అమలు పర్చకుండా ప్రజలను మోసం చేసిందని అన్నారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కూడా లేదన్నారు. నెల రోజులకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే.. దాదాపు పదేళ్ల పాలించిన బీఆర్ఎస్‌ను ఏమని విమర్శించాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ సంక్షేమ పథకాల పేరుతో దోపిడీకి పాల్పడి అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ ఎన్నిఎత్తులు వేసినా ప్రజలు నమ్మరని అన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్ రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 7: డీసీసీ అధికార ప్రతినిధి , ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కేటీఆర్‌కు సతీష్‌రెడ్డి శుభాకాంక్షలు

షాబాద్, జనవరి 7 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి ఆదివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తారక రామారావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 7 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) రంగారెడ్డి జిల్లా శాఖ రూపొందించిన డైరీని ఆదివారం తిరుమల హిల్స్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, నాయకులు పరమేష్, కృష్ణారెడ్డి, భార్గవి, బాల నర్సింహ, తాహెర్ ఆలీ, రాజ మల్లేష్, నవీన్, బాలకృష్ణ, శ్రీనివాస్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

యాచారం : ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు డా.రవీందర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నామని, ఉద్యమకారుల కుటుంబాలకు నెలకు రూ.5వేల ఆర్థికసాయం అందించాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలన్నారు. జంగయ్య, అంజయ్య, అబ్దుల్, ఎండీ ముజీబ్ తదితరులున్నారు.

జీపీ, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించిన సర్పంచులు

కొత్తూర్, జనవరి 7: మండల పరిధిలోని మక్తగూడలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, గూడూర్‌లో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాలను ఆ గ్రామాల సర్పంచులు కాట్న రాజు, సత్తయ్య ఆదివారం ప్రారంభించారు. రూ.20లక్షలతో మక్తగూడలో జీపీ భవనాన్ని, రూ.25లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు.


ప్రథమ బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ద్వితీయ బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి


తృతీయ బహుమతి అందజేస్తున్న రంగారెడ్డి జిల్లా అర్బన్ రిపోర్టర్ శ్రీనివాసచారి

వెల్లివిరిసిన ముత్యాల ముగ్గులు

సంక్రాంతి కాంతులు ముందే వెదజల్లాయి. మగువల రంగవల్లులు ముత్యాల జల్లును మరిపించాయి. ఆదివారం షాద్‌నగర్‌లోని కేఎన్(కట్టా నర్సింహులు గార్డెన్)లో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ ఇలపై హరివిల్లును తలపించింది. జిల్లా నలుమూలల నుంచి మహిళలు వచ్చి కళాప్రతిభను చాటారు.


ముగ్గు వేస్తున్న విద్యార్థిని


నగదు, బహుమతి అందజేస్తున్న కాసు శ్రీనివాస్‌రెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ విశాల



స్పాన్సర్స్ లోగో



శతాబ్ది టౌన్ షిప్ లోగో


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



లోగో వేస్తున్న విజయలక్ష్మి

ప్రతీ ఒక్కరు 'శ్రీరామ జ్యోతి' వెలిగించాలి

మహేశ్వరం/కేశంపేట, జనవరి 7 : ఈనెల 22న అయోధ్యలో భవ్యమైన, దివ్యమైన శ్రీరామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రజలందరూ శ్రీరామ జ్యోతి వెలిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్యయాదవ్ అన్నారు. అయోధ్య అక్షింతలను ఆదివారం తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో నివాసముంటున్న ప్రముఖ గాయని ఎస్సీ జానకికి అందించారు. జానకి మాట్లాడుతూ ఎందరో వేదపండితులచే పూజింపబడిన అక్షింతలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఎంపీటీసీ మద్ది రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ కె.శ్రీహరి, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చెల్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, విజయ్‌కుమార్ తదితరులున్నారు. ప్రతీఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి సర్పంచ్ స్వాతి బాలీశ్వర్ అన్నారు. గ్రామంలో అయోధ్య అక్షింతలను గడపగడపకూ చేరవేసి రామ మందిరం నమూన చిత్రపటాన్ని అందించారు. అంతకుముందు బొడ్రాయి వద్ద పూజ చేశారు. శేఖర్‌రెడ్డి, సూరం శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, కుమార్ గుప్తా, పల్లె అశోక్, మల్లేష్‌గౌడ్, ఉదయ్ కుమార్‌గౌడ్, రమేష్, శ్రీకాంత్, పూజారి ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.


మహేశ్వరం : అక్షింతలు అందుకుంటున్న గాయని ఎస్సీ జానకి

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

ఆమనగల్లు, జనవరి 7: ఉపాధ్యాయులు సమాజానికి, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు పురుషోత్తం రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలను ఎస్టీయూ నాయకులు సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎస్టీయూ నాయకులు పరమేశ్, కృష్ణారెడ్డి, భార్గవి, బాల్‌నర్సింహ, తాహెర్‌అలీ, తదితరులున్నారు. కాగా, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెడ్డిసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నేడు ప్రారంభించబోయే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. విఠాయిపల్లి సమీపంలోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కండె సుమన్‌చంద్రికల కుమార్తె కీర్తిక పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. కండె భాస్కర్, జగన్, శివకుమార్, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌రాథోడ్, బాబా, కండె లింగయ్య, కృష్ణనాయక్, నరేశ్ నాయక్, పరీద్, శ్రీకాంత్, కండె సత్యనారాయణ, అలీం, నాజర్, సత్యం శివలింగం తదితరులున్నారు.


వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

కల్వకుర్తి పట్టణంలో నేడు ఉదయం 10:30 గంటలకు తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు ,కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయులే అసలైన సమాజ సేవకులు

యాచారం, జనవరి 7: ఉపాధ్యాయులే అసలైన సమాజ సేవకులని బీఎన్‌రెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నందివనపర్తిలో పీఆర్టీయూ 2024 నూతన సంవత్సర క్యాలండర్‌ను శేఖర్‌రెడ్డి విడుదల చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. డీసీసీబీ ఇన్‌చార్జి ఛైర్మన్ సత్తయ్య, పీఆర్టీయూ అసోసియేట్ సభ్యులు అండెం ప్రతాప్‌రెడ్డి, మహేష్, కలకొండ అంజయ్య ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మహేశ్వరం, జనవరి 7 : ఆర్థికంగా బాగుపడాలనే ఆలోచనను దూరం పెడుతూ.. ఆరోగ్య సమస్యల పరిష్కారానికి మెరుగైన వైద్య సేవలందించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. తుక్కుగూడలో ఆదివారం కేఎస్‌టీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు వైద్య నిమిత్తం హైదరాబాదుకు వెళ్లకుండా మహేశ్వరం, తుక్కుగూడ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటుకావడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆసుపత్రి యాజమాన్యం చొరవ తీసుకోవాలని సబితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సబితారెడ్డి

వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం

కేశంపేట, జనవరి 7: మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారులోని నంబయ్య గుట్టపై వెలసిన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవరం వైభవంగా కొనసాగింది. హనుమాన్ దేవాలయం నుంచి నంబయ్య గుట్ట వరకు భక్తులు రథాన్ని లాగారు. యువకుల నృత్యాలు, కళాకారుల కోలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సర్పంచ్ మంజుల మల్లేష్, ఉపసర్పంచ్ జ్యోతి రాధాకృష్ణ, మనోహర్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పెద్ద నర్సింహా, ప్రతాప్‌రెడ్డి, రాఘవేందర్, నవీన్, శ్రీకాంత్, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : రథోత్సవంలో నృత్యాలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సుదర్శన నారసింహ, లక్ష్మీహయగ్రీవ యజ్ఞం

చేవెళ్ల, జనవరి 7 : మండల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో ఆదివారం దశావతారసహిత లక్ష్మీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన నారసింహ, శ్రీ లక్ష్మీ హయగ్రీవ (సరస్వతి) యజ్ఞం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అయ్యావారి వెంకటాచార్యులు, అర్చకులు శేషాద్రి, వేణు, ఫణీంద్ర, చేవెళ్ల సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దేవర సమతా వెంకట్‌రెడ్డి, నాయకులు రాములుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బెల్టుషాపులపై ఎస్వోటీ పోలీసుల దాడులు

చేవెళ్ల, జనవరి 7 : మండల పరిధిలోని బస్తేపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎస్వోటీ పోలీసులు, చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా బెల్టుషాపులపై దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని మూడు కిరాణాషాపుల్లో తనిఖీలు చేశారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు.

బియ్యం కోసం దుకాణానికి వచ్చి..
బంగారు గొలుసు అపహరణ

షాద్‌నగర్ రూరల్, జనవరి 7 : బియ్యం కోసం దుకాణానికి వచ్చిన దుండగుడు ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయిన ఘటన షాద్‌నగర్ పట్టణంలోని హాజీపల్లి రోడ్డులో జరిగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హాజీపల్లి రోడ్డులో జమున అనే మహిళ కిరాణం దుకాణాన్ని నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. మూడు రోజుల కింద ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై తన దుకాణానికి రాగా, ఒకతను బైక్‌పై ఉండగా మరొకతను తన వద్దకు వచ్చి బియ్యం కావాలని అడిగాడు. తను బియ్యం చూపించగా వేరే రకం బియ్యం కావాలని అడిగాడు. వేరే బియ్యం చూపిస్తుండగా ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని బైక్‌పై ఉన్న వ్యక్తితో కలిసి పారిపోయాడు. చించోడు, హాజీపల్లి గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో దొంగల ఫొటోలు రికార్డయినాయి. బాధితురాలు పోలీసులకు పిర్యాదు చేశారు.


సీసీ కెమెరాలో రికార్డయిన దొంగలు

క్రీడలతో మానసికోల్లాసం

మహేశ్వరం/మంచాల/ఇబ్రహీంపట్నం/కందుకూరు/యాచారం, జనవరి 7 : క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుడ్యానికి ఎంతో దోహదపడుతాయని జిల్లా కబడ్డీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం మండలం తుమ్మలూరులో సీజన్ నైన్ టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎంపీటీసీ రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ కె.శ్రీహరి, మాజీ సర్పంచులు తదితరులున్నారు. పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి మంచాలలో సూపర్‌స్టార్ యూత్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సైలు లాలయ్య, సతీష్‌తో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, నాయకులు, ఆర్గనైజర్స్ తదితరులున్నారు. అలాగే స్వామివివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జ్ఞానసరస్వతి ఫౌండేషన్ అధ్వర్యంలో ఇబ్రహీంపట్నం వినోభానగర్ సాధన కుటీర్‌లో నిర్వహించే వాలీబాల్ టోర్నీని ఏసీపీ శ్రీనివాస్‌రావు, ప్రముఖులు సీబీఆర్ ప్రసాద్ ప్రారంభించారు. సదావెంకట్‌రెడ్డి, టోర్నమెంట్ ఇన్‌చార్జి శంకర్, నిర్వాహకులు రాజు, వెంకటేష్, సురేష్ తదితరులున్నారు. అలాగే క్రీడలు యువతలో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని బీఎన్‌రెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి అన్నారు. జీపీఎల్-2 లీగ్ మ్యాచ్ జెర్సీలను విడుదల చేశారు. ఓడిపోయామని నిరుత్సాహపడకుండా మరోసారి విజయం సాధించడంపై దృష్టి సారించాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. యాచారం మండల సొసైటీ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి గున్‌గల్‌లో జీపీఎల్2 లీగ్ ను ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమ కారుడు మచ్చ లక్ష్మయ్య, డీసీసీ సభ్యుడు బాసాని బుచ్చిరెడ్డి తదితరులున్నారు.


మంచాల : క్రికెట్ టోర్నమెంటు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి


మహేశ్వరం : క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి


ఇబ్రహీంపట్నం : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు